క్లుప్తంగా

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రాజయ్య తెలిపారు. ఇటీవల బనగానపల్లె మండలం నందవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గస్థాయి అండర్-17, 14 కబడ్డీ పోటీల్లో మహేష్, జీవన్‌కుమార్, నరేష్, యోగాలో సుంకిరెడ్డి, విశాల్, బాల్‌బ్యాడ్మింటన్‌లో ఉసేన్, వాలీబాల్ పోటీల్లో అబ్దుల్ సత్తా చాటారన్నారు. త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, నాగేశుడు, మల్లికార్జున, శివశంకర్‌రెడ్డి, సుగుణ, జహీరాబీ, ఉసేన్‌వలి అభినందించారు.

పేరుసోముల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సీతారావమ్మ తెలిపారు. వివిధ క్రీడాంశాల్లో సత్తాచాటిన విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను అభినందించారు.

బాధ్యతల స్వీకారం

డోన్ రూరల్: డోన్ డివిజనల్ అభివృద్ధి అధికారిగా ఐ.నరసింహారెడ్డి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన్ను ఎంపీడీఓ శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ సుధీర్, పంచాయితీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భగత్‌సింగ్ విగ్రహ ఏర్పాటుకు వినతి

డోన్: పట్టణంలోని అమ్మ హోటల్ వద్ద స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్‌సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కౌన్సిల్ అనుమతి కోరుతూ సీపీఐ నాయకులు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్‌లకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుంకయ్య, సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు నారాయణ, రంగస్వామి, సిద్ధార్థ ఉన్నారు.

వరద బాధితులకు రూ.30 వేల విరాళం

ప్యాపిలి: విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక ప్రియదర్శిని పాఠశాల విద్యార్థులు కొద్ది రోజులుగా విరాళాలు సేకరించారు. సేకరించిన మొత్తం రూ.30 వేలను హెచ్ఎం పార్థసారథి సోమవారం యూపీఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, అక్బర్, పురుషోత్తంకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరద బాధితులకు సాయం చేసేందుకు విద్యార్థులు విరాళాలు సేకరించడం అభినందనీయం అన్నారు. ఈ మొత్తాన్ని వరద బాధితులకు అందజేయనున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



వరలక్ష్మి

డోన్ రూరల్: డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా వరలక్ష్మి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కె.జయనాథ్‌రెడ్డి అనంతపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడపలో పని చేస్తున్న వరలక్ష్మీ డోన్‌కు వచ్చారు. అలాగే ఎస్ఐలుగా సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అక్రమ మద్యం, నాటుసారా కట్టడిపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. మద్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రైవేట్ బస్సుకు రూ.లక్ష జరిమానా



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్టీఓ క్రాంతికుమార్

డోన్ రూరల్: రోడ్ ట్యాక్స్ కట్టినట్లు నకిలీ పత్రాలు చూపిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకు రూ.1,03,600 జరిమానా విధించినట్లు ఆర్టీఓ క్రాంతికుమార్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన ట్రావెల్స్ బస్సు బెంగళూరు నుంచి వరంగల్‌కు వెళుతుండగా ఆపి తనిఖీ చేశారు. రాష్ట్రానికి చెల్లించాల్సిన రోడ్ ట్యాక్స్ కట్టకుండా, కట్టినట్లుగా కంప్యూటర్‌లో తయారు చేసిన నకిలీ పత్రాలను చూపించారు. ఆ పత్రాలు నకిలీవని తెలుసుకుని జరిమానా విధించారు. వాహనాన్ని సీజ్ చేసి డోన్ ఆర్టీసీ డిపోకు తరలించారు.

అధికార పార్టీ చెప్పిందే అజెండా

- సభ్యుల అనుమతి లేకుండా అంశాలను అజెండాలో చేర్చిన కమిషనర్
- ఆగ్రహం వ్యక్తం చేసిన చైర్మన్, కౌన్సిలర్లు
- రసాభాసగా డోన్ కౌన్సిల్ సమావేశం



వాగ్వాదానికి దిగిన కోట్రికె హరికిషన్, దినేష్‌గౌడ్



తనకు తెలియకుండా అంశాన్ని అజెండాలో చేర్చడంపై కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న చైర్మన రాజేష్

డోన్: అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం డోన్ మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే సభ్యుల అనుమతి లేకుండా పలు అంశాలను కమిషనర్ ప్రసాద్‌గౌడ్ అజెండాలో చేర్చడంపై మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు ఎన్నుకున్న తమను కాదని అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు తలొగ్గి అధికారులు పనిచేయడం సరికాదని హితవుపలికారు.

చూపించిన అజెండా ఒకటి.. సమావేశంలో మరొకటి

తనకు అత్యవసర సమావేశం అజెండా అంటూ కొన్ని అంశాలతో కూడిన కాపీలను చూపించి సంతకాలు చేయించుకున్న అధికారులు, తనకు తెలియని అంశాలను కూడా అజెండాలో చేర్చడంపై మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంప్లెక్స్ భవనాల అద్దె తిరిగి యజమానులకు చెల్లింపు లాంటివేవీ తన దృష్టికి తీసుకురాకుండానే అజెండాలో చేర్చడం సరైన పద్ధతి కాదన్నారు.

సభ్యులను అగౌరవపరచడమే

సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య మాట్లాడుతూ.. తన వార్డులోని ఈద్గా మసీదు వద్ద మంచినీటి బోరు, మోటార్ ఏర్పాటు చేయాలని చాలా కాలం నుంచి కోరుతున్నా పట్టించుకోని అధికారులు, తనకు తెలియకుండానే అజెండాలో చేర్చడం తమను అగౌరవపరచడమేనని తెలిపారు. తాము ప్రతిపాదించిన సమస్యలను అజెండాలో చేరిస్తే ఆయా వార్డు ప్రజలు కౌన్సిలర్లను గౌరవిస్తారన్నారు. బయట వ్యక్తుల ప్రమేయంతో అజెండాలో అంశాలను చేరిస్తే కౌన్సిలర్లకు విలువ ఏముంటుందని ప్రశ్నించారు.

సంతకంపై రగడ : 13వ వార్డు సభ్యుడు టమటం దినేష్‌గౌడ్ మూడు నెలలుగా సమావేశానికి గైర్హాజరయ్యారంటూ అజెండాలో చేర్చడం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ అభ్యంతరం తెలిపారు. సభ్యునికి ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, చైర్మన్ అనుమతి లేకుండా అధికారులు ఇష్టారాజ్యంగా అజెండాలో అంశాలను చేర్చడం సరైన పద్ధతి కాదని కౌన్సిలర్లు మిట్టా ఉమామహేశ్వరి, మల్లికార్జున రెడ్డి, షాదిక్ అన్నారు. దినేష్‌గౌడ్ సమావేశానికి రాక ముందే మినిట్స్ బుక్‌లో ఎలా సంతకం పెడతారని టీడీపీకి చెందిన వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్ ఆరోపించారు. సమావేశానికి హాజరైన తర్వాతనే ఆయన సంతకం పెట్టారని సభ్యులు సమాధానం ఇచ్చారు. ఈ అంశంపై కోట్రికె హరికిషన్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, దినేష్‌గౌడ్, మిట్టా ఉమామహేశ్వరి మధ్య వాదోపవాదాలు జరిగాయి.

పొరపాట్లు జరగకుండా చూస్తాం

ఇకపై కౌన్సిలర్ల అనుమతి లేకుండా ఎలాంటి సమస్యలను అజెండాలో చేర్చమని కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. సభ సంప్రదాయాలను గౌరవిస్తామన్నారు. వరుసగా మూడు సమావేశాలకు హాజరుకాని సభ్యులకు నోటీసులు ఇచ్చిన తర్వాతనే అజెండాలో చేరుస్తామన్నారు.

వ్యాపారుల నుంచి అధిక వసూళ్లు

పట్టణంలో మటన్, చికెన్ వ్యాపారుల నుంచి రోజూ రూ.20 వసూలు చేయాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు రూ.100 వసూలు చేస్తున్నారని కోఆప్షన్ సభ్యుడు కుమ్మరి రాజు, పాతపేట రఫీ, కౌన్సిలర్లు మేకల విమల, టమటం లక్ష్మీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై వ్యాపారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి నిబంధనల ప్రకారమే నడుచుకునేలా ఆదేశించాలని చైర్మన్ రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: నగర పంచాయతీలో తాగునీటి సమస్యతో పాటు పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చైర్మన్ చలం రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా కాలనీల్లోని సమస్యలను వార్డు కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా తాగునీటి సమస్య అధికంగా ఉందని.. వారానికి ఓసారి నీరు వదులుతున్నారని తెలిపారు. పలుచోట్ల నీరు కలుషితం అవుతోందని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ చలంరెడ్డి, కమిషనర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్య ఉన్న మాట వాస్తవమేనని, దీనికి ప్రధాన కారణం పైపులైన్లు దిబ్బతినడమేనని తెలిపారు. దీనికి తోడు గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని స్టోరేజ్ చేసుకోవడానికి సంపులు లేకపోవడం వల్ల సమస్య వస్తోందన్నారు. రానున్న రోజుల్లో సంపుల నిర్మాణం చేపట్టడమే కాకుండా, పైపులైన్లు లీకేజీలు లేకుండా మరమ్మతులు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో దెబ్బతిన్న పైప్‌లైన్ మరమ్మతులకు నిధుల మంజూరు, అభివృద్ధి పనులు, అన్నా క్యాంటీన్ ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు సంబంధించి వార్డు సభ్యుల అమోదంతో నిధుల చెల్లింపులకు తీర్మాణం చేశారు. సమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, ఇబ్రహీమ్, కోట్ల మధు, మధు, హుసేన్‌బీ, ముబీనా, సుశీలమ్మ, ఎంగమ్మ, ఆదిలక్ష్మి, అంజి, ఎల్లయ్య పాల్గొన్నారు.

వేడుకగా ఉమామహేశ్వరుని పల్లకీ సేవ





ఆలయ ప్రాకారంలో స్వామివారిని ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది, స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను కనుల పండువగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రామేశ్వరున్ని తాకిన సూర్యకిరణాలు

మండలంలోని పలుకూరు గ్రామంలో వెలసిన రామేశ్వరస్వామిని సోమవారం సూర్యకిరణాలు తాకాయి. ఉదయం 7 నుంచి 7:30 గంటల మధ్య భానుడు ఆలయంలోని శివలింగాన్ని స్పృశించాయి. ఈ సందర్భంగా అర్చకుడు భాస్కరయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా భాద్రపద మాసం, పౌర్ణమి తరువాత మాసశివరాత్రి రోజు స్యూర్యకిరణాలు స్వామిపై స్పృశిస్తాయని అర్చకులు తెలిపారు.

సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలి



ర్యాలీలో బ్రాహ్మణ సంఘం నాయకులు

డోన్ టౌన్: దేశంలో దేవదాయ ధర్మాదాయ శాఖ స్థానంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేసి హిందూ సంప్రదాయాలతో పాటు దేవాలయాలను కాపాడాలని శతావధాని గండ్లూరి దత్తాత్రేయ శర్మ, గాయత్రి వేద బ్రాహ్మణ సంఘం అధక్ష, ఉపాధక్షులు శంకరయ్యశర్మ, క్లై శేషావలిశర్మ అన్నారు. సోమవారం పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి పాతబస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు బ్రాహ్మణులు, వివేకానంద సేవా సమితి సభ్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ నాగమణికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందూ దేవాలయాలు, ధార్మిక సంస్థలపై దాడులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవదాయ, ధర్మాదాయశాఖ నిర్వీర్యం అయ్యిందని.. వాటి స్థానంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేసి ఆలయాలను పరిరక్షించాలని కోరారు. సంఘం సభ్యులు నరసింహా, రామారావు, నరహరి, ఏవీరావు, జగన్‌మోహన్, జొన్నలగడ్డ శ్రీనివాసులు, ఫణిరాజ్, నరేష్, హేమసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ

కోవెలకుంట్ల: రబీ సీజన్‌లో మొదటి పంటగా పప్పుశనగ సాగుకు రాయితీ విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. మండల పరిధిలో శనగ పంట విస్తారంగా సాగవుతుందన్నారు. రైతులు ఈ నెల 3వ తేదీ నుంచి ఆయా రైతు సేవా కేంద్రాల్లో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అర ఎకరాకు 20 కిలోల చొప్పున ఐదు ఎకరాలకు గరిష్టంగా రెండు క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. సబ్సిడీ పోనూ క్వింటాకు రూ. 7,050 చొప్పున చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని వివరించారు.

పదవీ విరమణ సన్మానం



నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

డోన్ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సర్వసాధారణమని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెంకటాపురం పంచాయతీ కార్యదర్శి పి.నాగేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, సర్పంచ్‌లు ఆయన్ను సన్మానించారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు

డోన్ టౌన్: మండలంలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎస్ఎస్‌యూఐ నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కొందరు రియల్టర్లు వెంచర్లలో పార్కులు, బడులకు వదిలిన స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తున్నారని.. వెంచర్ల పక్కనున్న ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. డోన్‌లో సర్వే నంబర్ 380–బీలో 65 సెంట్లు, సర్వే నంబర్ 503లో 8.51ఎకరాలు కబ్జాకు గురైనట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రతాప్, విఘ్నేష్, శ్రీరామ్, రాజు, నాయక్ ఉన్నారు.

కొలిమిగుండ్లలో తగ్గిన పింఛన్లు

కొలిమిగుండ్ల: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లకు సంబంధించి అక్టోబర్ నెల కోటాలో మండలంలో 37 పింఛన్‌లు తగ్గాయి. సెప్టెంబర్ నెలలో 7103 పింఛన్‌లు ఉండగా ప్రస్తుతం 7066కు తగ్గాయి. 37 మంది లబ్ధిదారులు మృతి చెందడంతో వారిని జాబితా నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మండలంలో 170 పింఛన్‌లు డెత్ కేసులు కింద నమోదయ్యాయి. అయితే కొత్త పింఛన్‌ల నమోదుకు వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడంతో అర్హులైన లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రతి నెలా రెండు రోజులకే పింఛన్ పంపిణీని పరిమితం చేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నెలా 7 నుంచి 8 మంది పింఛన్ తీసుకోలేక పోతున్నారు. మరుసటి నెలలో కలిపి ఇవ్వకపోవడంతో నష్టపోతున్నారు.

రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



బాషాను అభినందిస్తున్న తోటి ఉపాధ్యాయులు

సంజామల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బాషా రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 29వ తేదీ కర్నూలు జిల్లా ఆదోనిలో జరిగిన జిల్లా స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ 40 ప్లస్ విభాగంలో షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. సోమవారం బాషాను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



బార్ కౌన్సిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: రాజస్థాన్, ఢిల్లీ, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను ఏపీలో అమలు చేయాలని డోన్ బార్ కౌన్సిల్ మాజీ కోశాధికారి పులిదామోదర్ కోరారు. సోమవారం బార్ కౌన్సిల్ అధ్యక్షుడు, సభ్యులను కలిసి వినతి పత్రం అందజేశారు. న్యాయవాదులపై దాడులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులు రామలింగయ్య, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఎల్లుండి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కొలిమిగుండ్ల: దసరాను పురస్కరించుకుని అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలో ఉన్న రాజరాజేశ్వరిదేవి ఆలయం, తిమ్మనాయినపేటలోని వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రోజుకో రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆయా రోజుల్లో లక్ష్మీనారాయణ యాగం, పుష్పాలంకరణ సేవ, కుంకుమార్చన, సహస్రదీపాలంకరణ సేవ, గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. భక్తులు రూ.10,116 చెల్లించి ఆయా తేదీల్లో వారు కావాల్సిన రోజున సేవల్లో ప్రత్యక్షంగా పాల్గొనవచ్చని చెప్పారు.

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడి మృతి



క్వాలిటీ బాషా(ఫైల్)

డోన్: డోన్ సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు క్వాలిటీ బాషా(75) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతిపై ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, గౌడ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, పోస్టు ప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయం, పోస్టాఫీసు, ఎస్కేపీ హైస్కూల్, రాజా టాకీస్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తారకరామానగర్, టీడీపీ కార్యాలయం, నారాయణ స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

వినియోగంలోకి చెత్త సంపద కేంద్రాలు



పునఃప్రారంభిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి

అవుకు: మండల పరిధిలోని చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 14 చెత్త సంపద కేంద్రాలను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయా కేంద్రాల్లో తడిచెత్తలో వానపాములను వదిలి ఎరువుగా తయారీ చేసి రైతులకు విక్రయిస్తామన్నారు. దీని వల్ల పంచాయతీకి ఆదాయం చేకూరుతుందన్నారు. అవుకు సమీపంలోని చెత్తసంపద కేంద్రాన్ని పునఃప్రారంభించారు. ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు శ్రీను, సుధాకర్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పరిశుభ్రత సాధ్యం



బేతంచెర్లలో మానవహారంగా నిలబడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

బేతంచెర్ల: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, సూపరింటెండెంట్ శిరీష అన్నారు. సోమవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా నిలబడి ఆరోగ్యమే–మహాభాగ్యం, పరిశుభ్రత –మన లక్ష్యం అంటూ నినాదాలు చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా తీసుకోవాలన్నారు.

ఏపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేద్దాం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

బనగానపల్లె: ఏపీటీఎఫ్ ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయనగరంలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగే మహా సభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి ఉపాధ్యాయులను కోరారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ఏపీటీఎఫ్ నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటకృష్ణుడు, రామకృష్ణ, అనీల్‌కుమార్, బ్రహ్మయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మావతి

కొలిమిగుండ్ల: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు రక్తహీనత నుంచి బయట పడవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో మండల స్థాయి అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఆకుకూరలు, వివిధ రకాల పిండి వంటలతో స్టాల్ ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు పాల్గొన్నారు.

• రోడ్డుపై గుంత పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్



గుంతను పూడ్చివేసిన తర్వాత ఇలా, (ఇన్‌సెట్) రోడ్డుపై గుంత(ఫైల్)

ప్యాపిలి: పట్టణ సమీపంలోని బనగానపల్లె క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతను అధికారులు సోమవారం పూడ్చివేయించారు. ఈ నెల 27న సాక్షిలో 'నడిరోడ్డుపై గుంత' అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆర్అండ్‌బీ ఏఈ మధు రోడ్డుపై పడిన గుంతను పూడ్చివేయించారు. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

అవుకు: మండల కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈనెల 3వ తేదీ నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు అవుకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడం ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆలయంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల్లో అమ్మవారు ప్రతి రోజు ఒక్కో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు జూటూరు రాజ్యలక్ష్మి, యువజన సంఘం అధ్యక్షుడు తాళేపల్లె నాగేంద్ర, సభ్యులు తల్లం నాగభూషణం, సూర్యనారాయణ, సునీల్, సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఆర్యవైశ్యులు